


# ఈజీ వాక్

## వి. రాజారామమోహనరావు


అసలే గందరగోళంగా వున్న మూర్తికి సుశీల కనపడింది. రోజులాగే ఆఫీసు నుంచి యింటికి నడుస్తున్నాడు.

సరిగ్గా మూర్తి సుశీలని చూసిన సమయంలోనే సుశీలా మూర్తిని చూసింది. చూట్టమే కాదు, తనకి అటు ఇటూ వుండి మాట్లాడుతున్న వాళ్ళని తప్పించుకుని నాలుగు అంగల్లో మూర్తిదగ్గరికి వచ్చేసింది.

"మూర్తీ నువ్వేనా?" అంది ముఖం లోకి చూస్తూ.

ఏమనాలో తెలియనివాళ్ళా సుశీలవేపు చూస్తూ.... 'అవును నేనే.... నేనే....' అన్నట్టు తలూపాడు మూర్తి.

"ఒక్క నిముషం యిలారా...వాళ్ళకి చెప్పేసి వెళ్ళిపోదాం...." అంటూ అతని చెయ్యి అందుకుని యిందాకటి నలుగురి దగ్గరికి లాక్కెళ్ళింది.



"యితను మూర్తి .... మా వూరే.... యిద్దరం కలిసి చదువుకున్నాం....." అని వాళ్ళ నలుగుర్నీ మూర్తికి పరిచయం చేసింది. వాళ్ళల్లో యిద్దరు నటులు. యింకొకతను రచయిత, నాలుగో మనిషి నాటకం డైరెక్టర్.

ముగింపుమాటల్లా..."యింకా నాలుగు రోజులలో రిహార్సల్స్ వున్నాయిగా పరవాలేదు....మరి నే వెళ్ళిరానా...." అంది సుశీల. వాళ్ళు 'సరే' అన్నాక మూర్తితో కలిసి ముందుకి నడిచింది.... నాలుగడుగులు వేశానోలేదో వెనకనుంచి "సుశీలా...." అంటూ పిలిచాడు డైరెక్టర్ మూర్తిని వదిలి వెనక్కి వెళ్ళింది సుశీల.

రోడ్లమీద, సినిమాహాళ్ళల్లో, రేషన్ షాప్‌దగ్గర.... యిలా ఎక్కడ జనాన్ని చూసినా విసుగ్గా వుంటోంది మూర్తికి. ఎందుకలా వుంటుందోకూడా ఆలోచించాలని అనిపించనంత విసుగు...ముఖ్యంగా తెలిసున్నవాళ్ళయితే మరీ యిబ్బంది. ఏదో మాట్లాడాలి .... కానీ మాట్లాడాలనిపించదు. మాట్టాటానికి ఏ విషయం వుండదు.తనలో లోపలఏవో చాలా,చాలా పెరిగిపోయి యిరుగ్గా గొడవగొడవగా వున్నట్టు యాతన. రోడ్డుమీద ఒంటరిగా నిశ్శబ్దంగా నడుస్తున్నా గందరగోళంగానే వుంటోంది మూర్తి ప్రాణానికి.

వెనకనుంచి సుశీల వొచ్చి...."రా.... రా...." అంది. రెండడుగులు వేశాక.... "నువ్వు చాలా ఏళ్ళనుంచి యిక్కడే వుంటున్నావు కదూ...." అంది.

'అవునన్నట్టు' తలూపాడు.

"పెళ్ళిచేసుకున్నావుగా .... పిల్లలు కూడా కదూ...." అంది.

మళ్ళీ 'అవునన్నట్టు....'తలూపాడు.

"గంగిరెద్దులా ఆ తలూపుడేమిటి.... మాట్లాడవే.... కొంపదీసి నన్ను మరిచిపోయావేమిటి?" అంది.

"బలేదానివే...ఎలా మరిచిపోతాను..." అన్నాడు మాట పెగుల్చుకుని మూర్తి.

"మరిచిపోలేదు....కానీ గుర్తులేను... అంతేనా?" అంది సుశీల నవ్వుతూ.

'నిజమే పచ్చి నిజం చెప్పింది .... సుశీలని మరిచిపోలేదు కానీ నిజంగాగుర్తులేదు.... మనిషి అప్పటిలాగే వుంది. పోతే కొంచం లావైంది. ఆ చూపుల్లో, మాటతీరులో, నవ్వులో స్త్రీత్వం మరింత పెరిగింది. పెళ్ళయిన కొత్తలో తరచుగా భార్యని సుశీలతో పోల్చుకుంటుండేవాడు. అప్పుడు సుశీల గుర్తుంది. కానీ ఆ తర్వాత ఎప్పుడు, ఎలా జరిగిందో కానీ సుశీల గుర్తులేకుండా పోయింది.

"నేను అర్జెంటుగా కాఫీ తాగాలి...." అంది చుట్టూ చూస్తూ సుశీల.

హోటల్‌లో కాఫీ తాగినంత సేపూ కూడా మూర్తిని సుశీలే మాట్లాడించింది. ఎక్కడుంటున్నావ్? ఎంతమంది పిల్లలు? ఏం చేస్తున్నారు? అంది. పొడిపొడి మాటలతో సమాధానం

చెప్పాడు తప్ప తనంతగా తనేం మాట్లాడ లేదు మూర్తి.

హోటల్‌దాటి తిరిగి రోడ్డుమీదకి వచ్చేవరకూ వోపికపట్టింది సుశీల. రోడ్డు క్రాస్ చేయబోతుండగా .... "చూడు మూర్తీ...." అంది. ఆగి సుశీలవేపు చూశాడు.

"ఎన్నో ఏళ్ళతర్వాత కలుసుకున్నాం. ఆత్మీయంగా నాలుగుమాటలు మాట్లాడు కుందామని నా చుట్టూవున్న వాళ్ళని పంపించి నీతో వచ్చాను. నువ్వేదో కొంప మునిగిపోతున్నట్టు యిలావుంటే యిద్ద రికీ యిబ్బందే.... నీ కేమాత్రం కష్టంగా వున్నా వెళ్ళిపో.... నా దారిన నేను వెళ్ళి పోగలను...." అంది.

ఏం చెయ్యాలో తెలియనివాడిలా అలాగే నిలబడిపోయాడు మూర్తి. ఎటు అడుగు వేస్తాడో అన్నట్టు చూస్తూ నిలబడింది సుశీల. రెండుక్షణాలు గడిచినా మూర్తి ఎటూ కదల్లేదు.

"ఏమిటి మూర్తీ...." అంది అను నయంగా సుశీల.

"ఏమో సుశీలా.... ఏం చెయ్యాలో నిజంగా నాకు తెలియటం లేదు." అన్నాడు.

ఏ నిర్ణయానికీ రాలేని అతని ముఖం చూస్తే నవ్వొచ్చింది సుశీలకి.... "సరేలే......." అంది మళ్ళీ చెయ్యి అందుకుంటూ....

యిద్దరూ కలిసి పదడుగులు వేసే లోపు.... "మా యింటికి వెడదాం.... నన్ను దింపేసి వెడుదువుగాని.... సరేనా...." అంది.

'సరే....' అన్నట్టు తలూపాడు.

యిద్దరూ పక్కపక్కనే నడుస్తు న్నారు. మూర్తి చెయ్యి వదిలేసింది సుశీల.... చెయ్యి అందుకున్నప్పు డెలా వున్నాడో.... చెయ్యివదిలేసినప్పుడూ అలాగే వున్నాడు.

'ఏమిటీ జడత్వం....' అనిపించింది సుశీలకి.

మరికొంత దూరం నడిచాక.... "తిరిగి నేను కనపడి.... యిలా కలిసి నడుస్తున్నా నీకేం అనిపించటంలేదూ..." అంది.

బదులుగా మూర్తేం మాట్లాడక పోయిన రెండు క్షణాలు సుశీల ముఖం లోకే చూస్తూ వుండిపోయాడు. అక్క డున్న వీధి వెలుగులో మూర్తి అదోలా కనిపించాడు సుశీలకి.

అతని కళ్ళల్లో అలజడి.... అల్లకల్లో లంలో తనని తను ప్రకటించుకోలేని నిశ్శబ్దంలా.... బాధగా కనిపించాడు.

"యిదివరకటి రోజులు వేరు మూర్తి. తేటనీటిలాంటి ఆ వయసు వేరు.... వొకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోకపోయినా అప్పుడు చాలా తెలిసేవి.... మాటలు అంతగా అఖ్ఖర్లేని రోజులవి. యిప్పుడలా కాదు. మనం మాట్లాడితే తప్ప ఏం తెలియదు. ఏం అర్థం కాదు. ఏన్నో ఏళ్ళ తర్వాత యిలా కలుసుకుని ఒకళ్ళ గురించి మరొకళ్ళు తెలుసుకోవాలని తహతహలాడిపోటం నాకు చాలా అమా నుషం అనిపిస్తోంది...." అంది సుశీల.

అమానుషం అన్నమాట మూర్తిని కది లించింది. నెమ్మదిగా మాటలు పెగిలాయి. గతం, ప్రస్తుతం సుశీల అన్నీ కలగలిసి చూపించిన ప్రభావం. మాట వెనక మాట.... గుర్తు వెనక గుర్తు.... సుశీల వుంటున్న చోటు చేరటానికి పట్టిన అర గంటలో చాలానే మాట్లాడాడు. తను వుంటున్న ఒకటిన్నర గది యిల్లు.... ముగ్గురు పిల్లల సంసారం.... పత్రికా ఫీసులో చిన్నసైజు యంత్రంలాంటి వుద్యోగం ....యిలా తన నగరజీవితపు భౌతిక వివరాలన్నీ చెప్పాడు.

సుశీల అద్దెకి తీసుకున్నది ఒక్కటే గది. ఎప్పుడు వచ్చినా, వెళ్ళినా యింటి వాళ్ళకేం యిబ్బందిలేకుండా వున్న గది.

గది చేరాక మంచం చూపించి "కూచో".... అంది సుశీల. గోడకి ఆను కుని మంచంమీద కూచున్నాడు. తలుపు దగ్గరగా వేసొచ్చి తనూ కూచుంది.

ఆ తర్వాత యిద్దరూ చాలా మాట్లాడు కున్నారు. కావల్సినవి, అఖ్ఖర్లేనివి.... నవ్వొచ్చేవి.... గతాన్ని యిద్దరూ నెమ రేసుకున్నారు. కొన్నింటి గురించి.... 'ఆ రోజుల్లో మనకి తెలియక కానీ.... అలా చేసుకుంటే బావుండేది....' అను కున్నారు.... అలా చాలా చాలా చెప్పు కున్నారు.

పరస్పరం యిద్దరికీ యిష్టం వుండీ దూరమైన గతం యిద్దరికీ ఏకకాలంలో తీపిగానూ, చేదుగానూ కూడా ఉంది.

అంత జరుగుతున్నా మూర్తిని అప్పటి జీవితపు దిగులు వదల్లేదు.

'సుశీలతో యిలా కూచుని మాట్లాడు తుంటే బాగానే ఉంది.... కానీ ఉప యోగం.... ఏం కలిసొస్తుంది.... దీని వల్ల బతుకు మెరుగుపడేదేం లేదు.... మరో పనికిరాని ఆకర్షణ.... నిజంగా ఆ రోజుల్లో ఎంత తహతహగా ఉండేది. అప్పటిదాకా సుశీలతో కాలేజీలో కలిసి వున్నా, మళ్ళీ అరగంట గడిచేలోపు ఆమెని చూట్టంకోసం వాళ్ళ సందులో సైకిల్‌మీద ఎన్ని ట్రిప్పులు కొట్టేవాడు. ఆ తర్వాత తర్వాత సుశీలతో దగ్గరగా వుండటంకోసం వాళ్ళన్నయ్యని స్నేహం చేసుకుని ఆ యింటికి రాకపోకలు సుగమం అవటంకోసం ఎంత యాతన పడ్డాడు. ... ఆ రోజుల్లో అవేవీ అలసటగా లేవు.... విసుగ్గా లేవు.... యిప్పుడు అదే సుశీల తన పక్కనే ఉంది.... కానీ ఏం చెయ్యాలో అర్థంకాని యీ పరిస్థితేమిటి.... చప్పున కౌగిలించేసు కుంటే....కౌగిలించుకుంటే.... ఆ వొళ్ళు, ఆ శరీరం.... అనుభవం.... ఆ తర్వాత మళ్ళీ అంతా మామూలే....'

"ఏమిటి మూర్తీ మళ్ళీ ఆలోచన.... ఏమిటి నీ బాధ...." అంది సుశీల.




సుశీల అలా అనగానే.... చప్పున కౌగలించుకోటం నుంచి.... కూచున్న మంచంమీదకి జారిపడ్డట్టు వులిక్కిపడ్డాడు మూర్తి.

"ఎందుకలా వున్నావో చెప్పు...." అని అప్పటికే రెండుమూడు సార్లు అడిగింది సుశీల. 'ఖచ్చితంగా యిదే బాధ అని తెలిస్తే తేలిగ్గా చెప్పుకోవచ్చు. కానీ అలా తెలియటంలేదు. అయినా ఎలాగేనా సుశీలతో తన పరిస్థితి చెప్పుకోవాలి....' అనుకున్నాడు మూర్తి. నెమ్మదిగా మాటలు కూర్చుకున్నాడు.

"ప్రత్యేకంగా యిదే బాధ అని కాదు సుశీలా. విసుగో, బాధో, దిగులో కాని దేమీ కనిపించటంలేదు. యీ ముప్పై అయిదేళ్ళకే జీవితమంతా అయిపోయి నట్టు అనిపిస్తోంది...."

"మరీ అంత నిరుత్సాహం అయితే ఎలా మూర్తీ.... ఏమిటి నీ యిబ్బంది? డబ్బు చాలకా... పెళ్ళామా... పిల్లలా... ఆఫీసా.... ఏమిటి? స్పష్టంగా చెప్పు..." అంది సుశీల.

"వొకటని కాదు. అన్నీ... నువ్విలా విడివిడిగా అడుగుతున్నా నా కివి వేరు వేరుగా అనిపించటంలేదు. అన్నీ కలిసిన ఒకటే యూనిట్ యిది.... వేరువేరుగా బాధపెడతాయి, అంతే.... ఆఫీసులో నా సామర్థ్యానికి తగిన పనిచేసే అవకాశం యివ్వరు. ఏదో గదిలో పెట్టి మూతేసినట్టు యిలాగే కదులు.... యిలాగే చెయ్యి అన్న అధికారం.... అలా అని అందర్నీ అలా చూడరు. నా కన్నా చేతకాని వాళ్ళకి చాలామందికి చాలా అవకాశాలు యిస్తారు. వాళ్ళు ఎన్ని తప్పులు చేసినా చెలామణీ అవుతుంది.

"యింక యిల్లు... రూపాయి కోసం, వొక్కోసారి అర్ధరూపాయి కోసం చాలా హీనంగా, నేను నాపెళ్ళాం వాదించు కోటం.... ఆ ఘర్షణకి యిద్దరం కారణం కాదు.... అర్ధరూపాయి విలువ మా యిద్దరి ప్రేమని అంతగా అధిగమించేసింది. పోతే పిల్లలు.... నేను వీళ్ళని ప్రేమించాలి.... వీళ్ళని జాగ్రత్తగా చూడ్డం నా బాధ్యత... అని అనుక్షణం అనుకుంటూ బతికే బతుకు.

"బతుకు కొంచెమేనా లైవ్లీగా వుండటానికి అవసరమైన ప్రతి అనుభూతి బలవంతంగా అద్దెకి తెచ్చుకుని బతుకుతున్నట్టు.... యిదంతా ఛండాలం కదూ.... మనం ఏంచేసుకోలేం.... ఎవరికీ ఏం చెయ్యలేం. యింకెందుకీ బతుకు.... సుశీలా...." అన్నాడు మూర్తి. అలాగే అదే ధోరణిలో చాలా చెప్పాడు.

పొడి సముద్రాల్లా వున్నాయి మూర్తి కళ్ళు. అతని గొంతులో, మాటల్లోని దైన్యం అర్థమవుతున్నాయి. పాతకాలం నాటి మూర్తిని...జీవితమంటే ప్రేమ.... ఒకళ్ళతో ఒకళ్ళు అన్నీ పంచుకుంటూ ముందుకి కలిసికట్టుగా నడవటమే బతుకు ధ్యేయం...అనీ.. అల్లిబిల్లి వూహల్లో తేలిపోయే పాతకాలం మూర్తిని పోలికకి తెచ్చుకుంటే యిప్పటి యీ మూర్తి యాతన మరింత బాగా అర్థమవుతోంది. కొద్ది ఏళ్ళ తేడాయే అయినా.... కొన్ని యుగాల దూరం. అలా అతన్ని చూస్తుంటే.. ఆలోచిస్తుంటే... మూర్తి కేవలం మూర్తిలా కనపళ్ళేదు సుశీలకి. చాలా నిరుత్సాహం కలబోతలా కనిపించాడు.

"ఒక్కటే సుశీలా... యిదంతా కళ్ళున్న గుడ్డితనం. దేన్ని చూడాలన్నా, దేనిలో యిన్వాల్వ్ అవ్వాలన్నా భయపడి చచ్చేస్థితి.... భరించలేని, తప్పించుకోలేని స్థితి. మనకి కావాల్సింది లేదన్న నిజమే కాదు... రోజురోజుకిఅబద్ధాలని, అసహజత్వాన్ని, దిగజారటాన్ని నేర్పుతున్న స్థితి యిది...."

మూర్తి బాధ సుశీలకి అర్థమైంది. శక్తి బాగా తగ్గాక ప్రతిదీ భయంగా వుంటుంది... అనాసక్తంగా వుంటుంది.

మూర్తిమీద అభిమానంగా వుంది... ప్రేమగావుంది...ఏదోచెయ్యాలనివుంది.. అతన్ని ఆ నిరుత్సాహంలోంచి, ఒక్క క్షణం ఒక్క అడుగేనా పైకితీసుకు రావాలి అనిపించింది సుశీలకి. ఆ క్షణంలో తలుపుచప్పుడు కాకపోతే ఏంచేసేదో... కానీ తలుపు తీసుకుని లోపలికి వచ్చేసి "సారీ," అన్నాడు రఘూ. అంతకు ముందు సుశీల మూర్తికి పరిచయం చేసిన నాటకం డైరెక్టర్.

"పరవాలేదు. రా రా..." అంది. అతను మరో అడుగు లోపలికి వేశాక "కూర్చో" అంది. మంచంమీద మరో చివర కూర్చున్నాడు రఘు.

అప్రయత్నంగానే మంచంమీంచి లేచాడు మూర్తి. మరో మూడు నిముషాలకి మూర్తితోపాటు గుమ్మందాటి వీధి చివరివరకూ వచ్చింది సుశీల.

"రఘూ యిప్పుడు వస్తాడని నేను అనుకోలేదు మూర్తీ. అతను వున్నా నువ్వు కూచోవచ్చు. కానీ అది ఎవరికీ సుఖంగా వుండదు. ఎన్నాళ్ళకో కలిశాం... మాట్లాడుకోవాలన్న కోరిక సగమే తీరింది. నువ్వంతా చెప్పావు. నేను చెప్పుకోవాల్సిందీ వుంది. రేపు రాత్రి యిద్దరం కలిసే భోంచేద్దాం. వంటచేసి ఎదురుచూస్తుంటాను.... సరేనా...." అంది సుశీల.

గబగబా తలూపి ...."వెడతా ...." అంటూ వచ్చేశాడు మూర్తి. ఆ రెండు క్షణాల్లో ఎక్కడనుంచి, ఎలా తోసుకొచ్చిందో ఆ తొందర, కనీసం వెనక్కి తిరిగి చూడనైనా చూళ్ళేదు మూర్తి.

ఆ రాత్రేకాదు....ఆ మర్నాటి పగలూ అయోమయంగానే గడిపాడు మూర్తి. సుశీల దగ్గరికి తిరిగి వెళ్ళటమా మానటమా అన్న జంజాటం తేలటంలేదు. గట్టిగా నిలబడి చూసుకుంటే వెళ్ళకుండా వుండలే దన్నది తెలుస్తుంది. కానీ అలా చూసుకునే ధైర్యం లేదు. లేకుండా తయారుచేసింది జీవితం.

చివరికి ఎలాగైతేనేం ఆఫీసు అయిన అరగంటకి సుశీల యింటివేపు బైల్దేరాడు.

తిరిగి ఎన్నో ఏళ్ళనాటి ఆత్రుత .... 'తీరావెళ్ళేటప్పటికి యింట్లోవుంటుందో... వుండదో .... ఎదురు చూస్తానందిగా.... ఏమో..,వున్నా వొంటరిగా వుంటుందో... లేక ఎవరేనా వుంటారో.... వుంటే.... అయినా ఏం కోరుకుని వెడుతున్నట్టు.... మరింత అలజడినా....'

తెగని ఆలోచనలతోటే సుశీల గది

తలుపు తోశాడు.... "రా....రా.... నీ కోసమే చూస్తున్నా...." అంది సుశీల మంచంమీంచి లేస్తూ.

సుశీల తప్ప ఎవరూలేని గదిని చూసుకుని మంచంమీద కూచున్నాడు మూర్తి.... సుశీల కూచుంది.

"ఇవాళ రిహార్సల్స్ ఎగ్గొట్టా....వాళ్ళు వొక్కటే ఏడుపు...." అంది సుశీల నవ్వుతూ....

మూర్తీ నవ్వాడు .... చాలా ఏళ్ళ తర్వాత తేలిగ్గా సుశీలతో కలిసి తిరిగి నవ్విన నవ్వది....నిజానికి కేరియర్‌ని, పనిని దృష్టిలో పెట్టుకుంటే సుశీల రిహార్సల్స్ ఎగ్గొట్టినందుకు నవ్వకూడదు. అయినా యిద్దరూ నవ్వుకున్నారు.

మరి కాస్సేపటికి ఆ గదిలో గాలి మరింత తేలికపడింది.

"ఏమిటో చెపుతానన్నావుగా ...." అన్నాడు మూర్తే కిందటిరోజుని గుర్తుతెస్తున్నట్టు. నిన్నటినుంచి సుశీలగురించి తెలుసుకోవాలన్న ఆత్రుతగానే వుంది. అయినా దానికీ భయమే.... తెలుసుకుని తను ఏం చేయగలడు...అన్న సందేహం.

"చెపుతాను మూర్తీ...కాలేజీలో చదువుకొనే రోజుల్నాటి సుశీలనే అయితే నీ మాటలు, నీ భావన...నువు చెపుతున్న జీవితం నాకు అర్థంఅయ్యేవి కావేమో... కానీ యీకొద్దికాలంలోనే నాకూ రకరకాల బాధలు, గొడవలూ ఎదురయ్యాయి.... నాన్నగారు పోయాడు...ఆయన పోయాక యింక ఆర్థికపరిస్థితే కాదు.... నా జీవితమే పూర్తిగా తల్లకిందులైంది" అంది సుశీల. తండ్రిపోయిన వార్త మూర్తీ విన్నాడు. కానీ అప్పుడు అంతగా పట్టించుకోలేదు.

"అన్నయ్యకి పెళ్ళయిన కొత్తలోనే నాన్నగారు పోయారు.. ఆయన పోయిన మొదటి రెండేళ్ళూ అదోరకంగా గడిచాయి. అప్పులాళ్ళూ, వాళ్ళతో అన్నయ్య తడివిట్లు.... ఆర్థిక యిబ్బంది కొద్దిగా



బాంబూలూ గింబూలూ నైజాంలా.... ఒక్క కాకరపూలే తెచ్చుకో అని చెప్పా మన కుర్రవెధవకే......

తెలిసినా నన్నెక్కువ బాధించింది నాన్నగారు లేనిలోటు ... అమ్మ ఎలాగూ లేదు.... అసలు నాన్నలేని జీవితం వొకటి వుంటుందని నే నేనాడూ ఊహగానేనా అనుకోలేదు. చెప్పుకోలేనంత దిగులు.... అనుక్షణం బాధ .... ఆయన నన్ను పెంచినతీరూ...చేసిన ముద్దూ అలాంటివి.

ఆయనకు తెలుసో తెలియదో మరి... ఆయన పెంపకం నాకు జీవితాన్ని పొగరుమోత్తనంగా చూట్టం నేర్పింది....ఏదేనా నేను కోరుకోటమే ఆలశ్యం అన్నదృష్టి. అన్నీ నాకు అందుబాటులో వుంటాయన్న ధీమా.... ఏ విషయం అలాగే అనుకున్నాను. ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాట్లో వుంటావనే అనుకున్నాను. నేను అలా అనుకోటం, నీకు చొరవలేక పోటం యిద్దర్నీ యిలా దూరంచేశాయి.

నాన్న తర్వాత నాకు మిగిలింది అన్నయ్య.... నాన్నగారు లేని లోటు అన్నయ్య తీర్చాలన్నది నా వుద్దేశం. కానీ పరిస్థితి అలా జరగనివ్వలేదు. యాడాది తిరిగేలోపల జీవితం చాలా మారింది. ఒక్క చీరకోసం.... ఒక్కో సారివొక రూపాయికోసం... కాసిని పూల కోసం అబద్ధాలు ....కక్కుర్తి...యింట్లో చోటుచేసుకున్నాయి.

ఏ ఆస్తీ మిగలకుండా మిగిలిన నేనూ....నా పెళ్ళి వాళ్ళకి పెద్ద అప్పులా తయారైంది. వదిన నా పెళ్ళిప్రస్తావన తీసుకొచ్చి అస్తమానం సణిగేది....పరోక్షంగా నాన్నగార్ని ఏదేదో అంటుండేది. అన్నయ్య కనీసం ఎదురు మాట్లాడేవాడు కాదు. రానురాను అన్నయ్యమీద నాకు కోపం పెరిగింది. నా బతుకు నేను బతకాలనుకున్నాను.

నా మీద ఏమాత్రం అభిమానం చూపించలేని వాళ్ళదగ్గరా.... నా ప్రతి చిన్న అవసరాన్ని, నన్నూ నెత్తిమీద శనిలా భావించే వాళ్ళదగ్గర వుండకూడదన్న ఆవేశం.... ముఖ్యంగా అన్నయ్య మీద కోపంతో తెగించాను.

ఇల్లుదాటి బైటికి వచ్చాక మొట్టమొదట గ్రహింపుకొచ్చిన విషయం.... అన్నయ్య మీద కోపగించుకోవటం అనవసరం అని. అన్నిచోట్లా బతుకు దిగజారుతూనేవుంది. వుమ్మడి కుటుంబాలు... బంధుప్రేమ.... యివి యిదివరకటిలా లేవు. రక్తసంబంధం, ప్రేమా, అభిమానం.... వీటి విలువ అన్నిచోట్లా అలాగే పడిపోయింది. అయినా తిరిగి అన్నయ్యదగ్గరికి వెళ్ళాలనిపించలేదు. కష్టాలు యిబ్బందులూ ఎదుర్కొంటున్న వాడికి కొంతవరకూ బరువు తగ్గించానని... చేసిన పని సరైందే.... అనిపిస్తోంది. ఆ

యిల్లు వొదిలేసి అప్పుడే రెండేళ్ళు అవుతోంది...." అంది సుశీల.

సుశీల తండ్రి, సుశీల అన్నయ్య మూర్తికి తెలియనివాళ్ళేం కాదు.... ఆ రోజుల్లో ఆ యిల్లు ఆ వీధికి గొప్ప.... సుశీల చిన్న రాజకుమారి.... అందుకే తను జీవితంలో వేరుగా తలవొంచాడు... చొరవ చెయ్యలేకపోయాడు....

"యింతకీ చెప్పొచ్చిందేమిటంటే... డబ్బు, సంపాదన, నిజం, అబద్ధం.... జీవితం యింతేకాదు మూర్తీ ... బతకటానికి వీటన్నింటికన్నా ఎక్కువగా అవసరమైంది యింకోటుంది.

యీ రెండేళ్ళలో నేను చాలా నికృష్టాలు, దరిద్రాలు అనుభవించాను. వున్నచోట వుండకుండా తిరిగాను. ఎన్నోరకాల చాకిరీలు చేశాను. అయినా బతుకేం బాగుపడిపోలేదు. యిప్పుడు చూడు యీ నాటకాల్లోకి దిగాను. వీటిలో అనుభవం వుండి కాదు. పెద్ద యిష్టం వుండీ కాదు. అవకాశం వొచ్చింది.... 'సరే' అన్నాను.... అలా అని గొప్ప సుఖంగా గడిపేస్తున్నానని కాదు. అంగాంగ వర్ణన దగ్గర్నించీ అన్నిరకాల అవాకులు, చవాకులూ పేలుతున్నారు. శరీరంలోని కండకీ, మాంసానికి తప్ప దేనికీ విలువ యివ్వటంలేదు. ఎప్పుడు భరించలేకపోతే అప్పుడు మానేస్తాను. అది వేరే విషయం. పెళ్ళిమీద, కుదురైన.... మనసైన సంసారంమీద ఆశ, నమ్మకం రోజురోజుకి తరిగిపోతున్నాయి. నంగిరి పింగిరిగా మాట్లాడ్డం, రాని నవ్వులు తెచ్చుకోవటం.... కొన్ని యిష్టంలేని పనులు చెయ్యటం నాకూ అలవాటైపోతున్నాయి. నాకూ వో అన్నయ్యున్నాడనీ, వుండీ యిలా బతుకుతున్నాననీ అనుకోటం నికృష్టంగానే వుంది...." అంది సుశీల.

అలా అంటున్న ఆ గొంతులో వొణుకు, ఆ మాటల్లో వొదిగివున్న కన్నీరు మూర్తికి కనిపించకపోలేదు. మాట పెగలకపోయినా ఏదో ఒకటి మాట్లాడాలనే వుంది మూర్తికి.

"ఏంలేదు మూర్తీ.... బాధలు లేవని కాదు.... లేవనుకోమనీ కాదు....తప్పని బరువుంది.... మోయాలి.... మోస్తూ నడవక తప్పదు.... అలాంటప్పుడు.... మన బతుకిలామిగిలింది కనీసం నడవటం అయినప్పుడు.... ఏదో వందల టన్నుల బరువుందనుకుని బాధపడేకన్నా, తేలికే, తేలిగ్గానే వుంది.... అనుకుంటే నడక మరింత తేలిగ్గా వుంటుందని.... నా వరకూ నాకు అలాగే వుంది. నీ బాధలు, సమస్యల కన్నా నాది ఎక్కువో తక్కువో తెలియదు. కానీ నాకూ మనసు కరువైనట్టు, శరీరం అద్దెకి పెట్టినట్టు బతుకుతున్న యీ బతుకు నాకూ వెలితిగానే వుంది. అయినా మొండితనం.... ఎప్పటికో అప్పటికి నిలకడరాదా అన్న ధైర్యం.... అంతే.... ముందు మనకి మనం వుపయోగపడితే, ఆ తర్వాత మిగిలినవాళ్ళకి ....ఏమంటావు...."అంది సుశీల నవ్వేస్తూ....

ఆ తర్వాత యిద్దరూ కలిసి అన్నం తిన్నారు. మంచంమీద కూచుని కబుర్లాడుకున్నారు. క్రితం రోజుకన్నా ఎక్కువగా నవ్వుకున్నారు.

"నిన్న నీ స్థితి చూసి...ఆ ఆవేశంలో ఏం చేద్దామనుకున్నానో తెలుసా...." అంది సుశీల మాటల మధ్యలో.

'ఏమిటన్నట్టు చూశాడు...'మూర్తి.

"ఎందుకులే.... వొద్దులే...." అంది సుశీలే తిరిగి.

అర్థం అయిందన్నట్టు నవ్వాడు మూర్తి.

సుశీలా నవ్వింది. శరీరాల చేరువని మించిన పరస్పర సంపర్కం యిద్దరికీ అందింది. సుశీల అల్లీ బిల్లీ నవ్వుల్లోంచి కొత్త శక్తి అందింది మూర్తికి. మరి కొంచంసేపయ్యాక క్రితం రోజులాగే సాగనంపింది మూర్తిని సుశీల.

రోడ్డుమీద ఒక్కడూ నడుస్తున్న మూర్తికి తన పక్కనే సుశీలా నడుస్తున్నట్టే అనిపించింది.

ఒక్క రాత్రితో తన ఎన్నో ఏళ్ల తాలూకు బరువు తగ్గదని తెలిసినా మూర్తికి తృప్తిగానే వుంది అలా నడుస్తుంటే ఆ రాత్రి కొంచెం కొత్తగా కనపడింది.

'సుశీల వొంటరి ఆడది.... బతుకుతోంది....చుట్టూ వున్న కుళ్ళూ, దరిద్రం తెలిసీ జీవితంలో నడుస్తోంది. తలుచుకుంటే తనూ నడవలేడా.... నడుస్తూ ధైర్యాన్ని పెంచుకోలేడా....'

చాలా రోజుల తర్వాత రోడ్డుమీద మనుషులు....రిక్షాలు, టీ కొట్లూ, లైట్లూ, పాటలు.... పిల్లలూ.... యిలా చాలా చాలా.... ప్రత్యేకంగా కనిపించాయి మూర్తి దృష్టికి.

చుట్టూ అలా జనాన్ని.... ఆ సందడినీ చూసినా అంత విసుగనిపించలేదు మూర్తికి.

